క్లుప్తంగా

ఇస్కాన్‌లో ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో రాధాకృష్ణులు

కొమ్మాది: సాగర్‌నగర్ ఇస్కాన్ మందిరంలో ఆదివారం వారాంతపు పూజా కార్యక్రమంలో భాగంగా హరేకృష్ణ, హరేరామ నామస్మరణలతో ప్రత్యేక పూజలు చేశారు. రాధాకృష్ణులు, సుభద్ర, బలభద్ర జగన్నాథుడు, సీతారాములు, ఆంజనేయ, నరసింహస్వామి విగ్రహాలను వివిధ వర్ణాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. స్వామివారి లీలలు, మహిమలను వర్ణిస్తూ భక్తులు భజనలు, గీతాలాపనలు చేశారు.

నేడు ఆధ్యాత్మిక పీఠం వార్షికోత్సవం

భీమునిపట్నం: భీమిలి బీచ్‌రోడ్డులోని విశ్వ విజ్ఞాన ఆధ్యాత్మిక పీఠం 22వ వార్షికోత్సవం సోమవారం నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా పీఠాధిపతి సద్గురు డాక్టర్ ఉమర్ అలీషా ప్రత్యేక పూజలు, ఆధ్యాత్మిక ప్రవచనాలు నిర్వహిస్తారు. అలాగే సద్గురు పాద పూజా మహోత్సవాన్ని కూడా నిర్వహిస్తారు.

దక్షిణ మండల టెన్నిస్ పోటీలకు గీతం జట్టు


ఎంపికైన జట్టు

కొమ్మాది: అసోసియేషన్ ఆఫ్ ఇండియన్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో ఈ నెల 27 నుంచి 30వ తేదీ వరకు మచిలీపట్నంలో కృష్ణా విశ్వవిద్యాలయంలో దక్షిణాది రాష్ట్రాల విశ్వవిద్యాలయాల పురుషుల టెన్నిస్ పోటీలు జరగనున్నాయి. ఈ పోటీలకు గీతం జట్టును ఎంపిక చేసినట్టు క్రీడా విభాగం డైరెక్టర్ డా.యు.విజయ్ కుమార్ తెలిపారు.

కోవిడ్ సంక్షోభంపై గ్రంథావిష్కరణ


గ్రంథాన్ని ఆవిష్కరిస్తున్న ప్రొఫెసర్ నాగేంద్ర ప్రసాద్

కొమ్మాది: కోవిడ్-19 మహమ్మారి నేపథ్యంలో ప్రపంచ వ్యాప్తంగా వివిధ రంగాల్లో వచ్చిన మార్పులు, సంక్షోభం, నేర్పిన పాఠాలపై గీతం ఇంజినీరింగ్ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డా. తరుణ్ దొల్లా రచించిన గ్రంథాన్ని ఆదివారం గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ డైరెక్టర్ ప్రొఫెసర్ నాగేంద్ర ప్రసాద్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గ్రంథ రచయిత తరుణ్ మాట్లాడుతూ కోవిడ్ -19 నేపథ్యంలో ప్రపంచ దేశాల్లో ప్రభుత్వ, ప్రైవేటు రంగ సంస్థలు కలిసి పనిచేసే విధానం, ఫలితాలు, వైద్య ఆరోగ్య సదుపాయాలు, రవాణా వంటి రంగాలు ఏవిధంగా ప్రభావితం అయ్యాయో వివరిస్తూ భవిష్యత్‌లో వ్యూహాత్మకంగా ఎలా వ్యవహరించాలో సూచించినట్లు తెలిపారు.

మహిళ ఆత్మహత్య

పీఎంపాలెం: స్థానిక ఎంవీవీ సిటీ అపార్ట్‌మెంట్‌లో ఓ మహిళ ఆత్మహత్య చేసుకుంది. భార్యాభర్తలైన దొంగరామకృష్ణ, రాధాకుమారి ఈ అపార్ట్‌మెంట్‌లో నివాసం ఉంటున్నారు. వీరికి ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఆదివారం రాధాకృష్ణ పనికోసం బయటకు వెళ్లి తిరిగి వచ్చి చూడగా బెడ్ రూమ్ లాక్ చేసి ఉంది. లాక్ తీసి చూడగా భార్య రాధాకుమారి సీలింగ్ ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. తన భార్య అనారోగ్య కారణాలతో ఆత్మహత్య చేసుకుని ఉండవచ్చునని, ఎవరిపైనా అనుమానం లేదని పీఎం పాలెం పోలీసులుకు రాధాకృష్ణ ఫిర్యాదు చేశారు.

పాడి రైతుకు తోడుగా..

- పశువైద్య సేవలు సూపర్
- రైతులకు ఎలాంటి హామీ లేకుండా రుణాలు



తగరపువలస: గ్రామీణ ప్రాంతాల్లో అధిక ఉత్పాదక శక్తి కలిగిన పేద రైతులకు సైతం గుమ్మం వద్దనే నాణ్యమైన పశువైద్య సేవలు అందించే ఏర్పాటు రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలు చేస్తోంది. జాతీయ వ్యవసాయ కమిషన్ -1976 సిఫారసుల మేరకు ప్రతి 5 వేల పశువుల యూనిట్‌కు ఒక వైద్యుడు ఉండాలన్న సూచనను పక్కాగా అమలు చేస్తోంది. ప్రస్తుతం భీమిలి నియోజకవర్గంలో 11 పశువైద్యశాలలు, 51 రైతు భరోసా కేంద్రాలు, రెండు డాక్టర్ వైఎస్సార్ సంచార పశు ఆరోగ్య సేవ వాహనాలు కలిపి 3.75 లక్షల గేదెలు, ఆవులు, గొర్రెలు, మేకలు, పందులు, కుక్కలు, కోళ్లకు నిత్యం వైద్యసేవలు అందిస్తున్నాయి. వీటిలో భాగంగా పశువులకు గాలికుంటు వ్యాధి నివారణకు టీకాలు వేసే కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రారంభించింది. అలాగే వైఎస్సార్ పశువ్యాధి సంరక్షణ కేంద్రాలలోని ల్యాబ్‌లలో పేడ పరీక్షలు నిర్వహించి ఏడాదిలో నాలుగు సార్లు మేకలు, గొర్రెలకు నట్టల నివారణ వ్యాక్సిన్లు ఇస్తున్నారు. ప్రతి డిసెంబరులో పారుడు వ్యాధి నివారణకు టీకాలు ఇస్తున్నారు. ఇటీవల దేశవ్యాప్తంగా విజృంభించిన లంపి స్కిన్ వ్యాధి నివారణకు సకాలంలో ప్రభుత్వం స్పందించడంతో ఉత్తరాంధ్రలో దాదాపు ఈ వ్యాధి అదుపులో ఉంది. అధిక పాల దిగుబడి కోసం ఒక్కో రైతుకు 1800 కిలోల వంతున సంపూర్ణ మిశ్రమ దాణా కిలోకు రూ.10 సబ్సిడీ పోను రూ.6.50కే అందిస్తున్నారు. పశు కిసాన్ క్రెడిట్ కార్డుల ద్వారా ఎలాంటి హామీ లేకుండా రైతులకు 7 శాతం వడ్డీతో రూ.24వేల నుంచి రూ.1.60 లక్షల వరకు రుణాలు అందిస్తున్నారు. ఇంకా చేయూత, ఆసరా పథకాల ద్వారా పాడి, కోళ్ల పరిశ్రమ అభివృద్ధికి ప్రభుత్వం సహాయపడుతూ వస్తోంది.


పశువులకు వైద్యం అందిస్తున్న సిబ్బంది


1962 హెల్ప్‌లైన్ ద్వారా వైద్యసేవలు

నియోజకవర్గంలో ఉన్న పశువైద్యశాలలు	11
రైతు భరోసా కేంద్రాలు	51
సంచార వాహనాలు	2
వైద్య సేవలు పొందుతున్న పశువుల సంఖ్య	3.75
పూర్తయిన పారుడు వ్యాధి నివారణ టీకాలు	90%

రైతు భరోసా కేంద్రాలు, సంచార పశు ఆరోగ్యసేవ..

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటైన తరువాత పాడి రైతు ముంగిటకే వైద్య సేవలు అందించేందుకు గాను నియోజకవర్గంలో 51 రైతు భరోసా కేంద్రాలు, భీమిలి, ఆనందపురంలో రెండు డాక్టర్ వైఎస్సార్ సంచార పశు ఆరోగ్య సేవ వాహనాలను అందుబాటులో ఉంచింది. ఆర్బీకే, పశు వైద్యశాలలతో పాటు కాల్ హెల్ప్‌లైన్ ద్వారా 1962కు ఫోన్ చేస్తే మారుమూల ప్రాంతాలకు అత్యవసర సేవలు అందించడానికి వైద్యబృందం క్షణాల్లో వాలిపోతుంది. 75 శాతం సబ్సిడీలో సంపూర్ణ మిశ్రమ దాణా, పశుగ్రాస విత్తనాలు, గడ్డి కత్తిరించే యంత్రాలు అందుబాటులో ఉన్నాయి. పారుడు వ్యాధి నివారణ టీకాలు 90 శాతం పశువులకు ఇప్పటికే పూర్తి కాగా వలసలు పోయిన వారి తిరిగి వస్తే వారి పశువులకు కూడా వీటిని పూర్తి చేయనున్నారు.


శింగనబందలో రైతు భరోసా కేంద్రం

టీడీపీ హయాంలో కబేళాలకు పశువులు

టీడీపీ ప్రభుత్వ హయాంలో పాడి పరిశ్రమ గడ్డు కాలం ఎదుర్కొంది. బీమా, దాణా, టీకాలు వంటివి సకాలంలో అందించలేకపోవడంతో పాడి దిగుబడి తగ్గిపోయింది. దీంతో చాలా వరకు రైతులు తమ పశువులను కబేళాలకు తరలించుకోవలసి వచ్చేది.

మెరుగైన సేవలు



గత ప్రభుత్వాలతో పోలిస్తే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రైతులతో సమానంగా పాడి రైతులకు కూడా అధిక ప్రాధాన్యత ఇచ్చి అన్నిరకాల సేవలు అందుబాటులో ఉంచింది. మేలైన పాల సేకరణ ధరలు కూడా అందించి ప్రోత్సహిస్తోంది.

– ఊళ్ల అప్పలరాముడు, పాడిరైతు, సంగివలస

1962కు ఫోన్ చేస్తే చాలు



పశువులకు ఎలాంటి వ్యాధులు, అసౌకర్యం తలెత్తినా హెల్ప్‌లైన్ నంబరు 1962కు ఫోన్ చేస్తే చాలా వెటర్నరీ అసిస్టెంట్ వాహనంతో వచ్చి వాలిపోతున్నారు. ప్రతి రోజు మూడు మండలాల్లో 30 వరకు గ్రామాలకు సేవలు అందుతున్నాయి.

–సూర్యనారాయణ, పాడిరైతు, దాకమర్రి

పాడి రైతులకు వరం



వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పాడిరైతుల పాలిట వరంగా మారింది. రైతు భరోసా కేంద్రాల ద్వారా దాణా, మందులు, టీకాలు, బీమా వంటి సదుపాయాలు కల్పిస్తున్నారు. దీంతో పాడి లాభసాటిగా మారి వలసలు తగ్గిపోయాయి.

–గుజ్జు వెంకట పైడి సూరిబాబు రెడ్డి, చిట్టివలస

రామాలయాలకు అయోధ్య అక్షింతలు

పద్మనాభం: పద్మనాభంలోని కుంతీ మాధవ స్వామి ఆలయంలో ఉన్న అయోధ్య మందిరం అక్షింతలను పలు రామాలయాలకు ఆదివారం పంపిణీ చేశారు. విశాఖపట్నం అంబికాబాగ్ రామాలయం నుంచి అయోధ్య రామమందిరం అక్షింతలను ఈ నెల 17న కుంతీ మాధవ స్వామి ఆలయానికి తీసుకువచ్చారు. ఈ ఆలయంలో అక్షింతలను ఇంత వరకు ఉంచారు. వీటిని ఇప్పుడు మద్ది, కృష్ణాపురం, అనంతవరం, పెంట, కొవ్వాడ, విలాస్కాన్‌పాలెం, గంధవరం, బాందేవపురం తదితర రామాలయాలకు తీసుకు వెళ్లారు. పంచాయతీలకు చెందిన గ్రామ పెద్దలు ఈ అక్షింతలను తీసుకు వెళ్లారు.ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకుడు తాలాడ పద్మనాభం, టీడీపీ నాయకుడు కంటుభుక్త ఎర్నాయుడు.

రామాలయాలకు అక్షింతలు పంపిణీ

తగరపువలస: అయోధ్య భవ్య రామ మందిర ప్రతిష్ట కార్యక్రమంలో భాగంగా అక్కడి నుంచి వచ్చిన అక్షింతలు భీమిలి మండలంలోని పలు రామాలయాలకు చేరవేసే కార్యక్రమం ఆదివారం భీమిలి మండలం శింగనబంధ పంచాయతీ కృష్ణంరాజుపేట రామాలయం నుంచి ప్రారంభమైంది. విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో భీమిలి జెడ్పీటీసీ సభ్యుడు గాడు వెంకటప్పడు, సర్పంచ్ గాడు వెంకట నారాయణ, పరిషత్ సభ్యులు నీలాపు సూర్యనారాయణరెడ్డి, సురాల వెంకటరావు, నరసింగరావు, నాగేశ్వరరావు, గుడ్డాల ఎల్లయ్య, గాడు వెంకటరావు, తుపాకుల అప్పలనాయుడు, జోగ రాజారావు, బోని రామకృష్ణ, కనకల ధర్మప్రసాద్ అలాగే హిందూ ధర్మ పరిరక్షణ కమిటి సభ్యులు పాల్గొన్నారు. మండలంలోని తాటితూరు, టి.నగరపాలెం, తాళ్లవలస, రేఖవానిపాలెం, మూలకుద్దు, చిప్పాడ, అన్నవరం, పెదనాగమయ్యపాలెం, అమనాం, బోడమెట్టపాలెం, దాకమర్రి, మజ్జిపేట, మజ్జివలస, లక్ష్మీపురం, నారాయణరాజుపేట, శింగనబంద, మద్దిలపేట తదితర గ్రామాలలోని రామాలయాలకు ఊరేగింపుగా వెళ్లి అందించారు. ఆయా ఆలయాలలో ప్రతిరోజు గంటపాటు హరేరామ హరేకృష్ణ భజన అనంతరం అక్షింతలను గ్రామంలో ప్రతిఇంటికి పంపిణీ చేయనున్నారు.


కృష్ణంరాజుపేట రామాలయం నుంచి అక్షింతలు తరలిస్తున్న విశ్వహిందూ పరిషత్ ప్రతినిధులు


అక్షింతలను రామాలయానికి తీసుకు వెళుతున్న కృష్ణాపురం రెల్లి కాలనీ వాసులు

భక్తిశ్రద్ధలతో హనుమత్ వ్రతం

మధురవాడ: హనుమత్ వ్రతం పర్వదినాన్ని పురస్కరించుకుని మధురవా డలోని వివిధ ఆంజనేయ స్వామి ఆలయాల్లో భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు. ఇందులో చంద్రపాలెం దుర్గాలమ్మ ఆలయ క్షేత్ర పాలకుడు పంచముఖ ఆంజనేయ స్వామికి సుప్రభాత సేవతో పూజలు ప్రారంభించి పంచామృత, సుగంధ, జాలాభిషేకం చేసి, నాగవల్లి ధలాలు, చామంతి పూలతో అలంకరణ చేసి నిమ్మ కాయలు, గారెలు దండలు వేశారు. మధురవాడ జంక్షన్ సిద్ధేశ్వర స్వామి పీఠంలో గల పంచముఖ ఆంజనేయ స్వామి ఆలయంలో సామూహిక హనుమత్ వ్రతాలు నిర్వమించారు. స్వామికి పంచామృత, సుగంధ అభిషేకాలు అనంతరం పూలు, తమల పాకులతో అలంకరణ చేశారు. వీటితో పాటు ఇతర ఆలయాలకు భక్తులు విశేషంగా తరలివచ్చి పూజలు నిర్వహించారు.


పంచముఖ ఆంజనేయ స్వామి


పూజలు చేస్తున్న అర్చకులు

ఘనంగా పోలమాంబ నెల పండగ

భీమునిపట్నం: భీమిలిలోని ఎగువపేట మత్స్యకారుల ఆరాధ్య దైవం పోలమాంబ అమ్మవారి నెల పండుగ కార్యక్రమం ఆదివారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా గ్రామాభివృద్ధి సేవా సంఘం అధ్యక్షుడు గంటా నూకరాజు, వర్కింగ్ ప్రెసిడెంట్ అల్లిపిల్లి నర్సింగరావు ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఇందులో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ముత్తంశెట్టి మహేష్, ఇతర పార్టీల నాయకులు, గ్రామ పెద్దలు పాల్గొనగా వారిని సత్కరించి జ్ఞాపికలను అందించారు. అలాగే నాలువేల మందికి భారీ అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించగా దాన్ని మహేష్ ప్రారంభించారు. ఇందులో సేవా సంఘం కార్యదర్శి వాసుపల్లి కొండబాబు, గౌరవాధ్యక్షుడు మైలిపల్లి షణ్ముఖరావు, పెద్దలు అల్లిపిల్లి అప్పారావు, వాసుపల్లి గరగయ్య, వాసుపల్లి ప్రసాద్, కారి చిన్నారావు పాల్గొన్నారు.


అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ముత్తంశెట్టి మహేష్

అలరించిన క్రిస్మస్ వేడుకలు


సాయిరవీంద్ర పాఠశాలలో క్రిస్మస్ వేడుకలు

తగరపువలస: జీవీఎంసీ భీమిలి జోన్ ఒకటోవార్డు రామన్నపేట సాయి రవీంద్ర పాఠశాల, ఇన్‌క్రెడిబుల్ ప్లే స్కూల్‌లో ఆదివారం సంయుక్తంగా క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. కరస్పాండెంట్ బోగెల కృష్ణ, ప్రిన్సిపాల్ వాండ్రాసి సతీష్ కేక్ కట్ చేసి బైబిల్ సందేశాలను వినిపించారు. విద్యార్థులు క్రీస్తు జననం గురించి లఘు నాటకాన్ని ప్రదర్శించారు. అనంతరం విద్యార్థులచే నృత్య ప్రదర్శన, శాంతాక్లాజ్, దేవదూతల వేషధారణలు ఆకట్టుకున్నాయి. అనంతరం ఆహూతులకు అల్పాహారం పంపిణీ చేశారు.

సంక్షేమ పథకాలపై అవగాహన

తగరపువలస: భీమిలి మండలం దాకమర్రి సచివాలయం ఫిషరీస్ అసిస్టెంట్ వాసుపల్లి ఎల్లాజీ ఆదివారం నగరంలోని పలు మత్స్యకార గ్రామాల్లో సంక్షేమ పథకాలపై మత్స్యకారులకు అవగాహన కలిగించారు. అప్పుఘర్, వాసుపల్లి పాలెం, గంగవరం తదితర గ్రామాల్లో తీరప్రాంత వాడబలిజ మత్స్యకారులకు ఫిష్ ఆంధ్ర షాపులు, బోట్ల రిపేర్, రీప్లేస్‌మెంట్ పథకాలు, పీఎంఎంఎస్‌వై కిసాన్ క్రెడిట్ పథకాల రుణాలు, సబ్సిడీల గురించి వివరించారు.

ఈ కార్యక్రమంలో తీరప్రాంత వాడబలిజ సంఘం అధ్యక్షుడు పేర్ల భాస్కరరావు, గరికిన వేణుగోపాల్, గంటిపల్లి రామకృష్ణ, ఉమ్మిడి దాసు, మూగి శ్రీరామమూర్తి తదితరులు ఉన్నారు.


సంక్షేమ పథకాలపై అవగాహన కలిగిస్తున్న దాకమర్రి ఫిషరీస్ అసిస్టెంట్ ఎల్లాజీ

నృత్యపోటీల్లో కేజీబీవీ విద్యార్థుల ప్రతిభ

ఆనందపురం : జాతీయ స్థాయి బాలరంగ్ నృత్య పోటీల్లో మండలంలోని నేలేరు కస్తూర్బా గాంధీ బాలికల (కేజీబీవీ) విద్యాలయం విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. ఈ మేరకు నిర్వాహకుల చేతులు మీదుగా మెమెంటో, ప్రశంసా పత్రాలను అందుకున్నారని విద్యాలయం ప్రత్యేకాధికారి చంద్రకళ చెప్పారు. 15 మంది విద్యార్థులు విజయవాడలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీలలో ప్రథమ స్థానం సాధించి ఈ నెల 21న భోపాల్‌లో జరిగిన జాతీయ స్థాయి పోటీలలో పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబరిచి ప్రత్యేక ప్రశంసలు పొందారు. ఈ మేరకు విద్యార్థులను ఆదివారం సర్వశిక్ష అభియాన్ ఏపీసి బి.శ్రీనివాసరావు, జీసీడీవో కలేషాబేగం, కార్యక్రమం కో-ఆర్డినేటర్ శారదాదేవి తదితరులు అభినందించారు.


ప్రశంసా పత్రాలతో కేజీబీవి విద్యార్థులు

ఆర్‌ఎంపీలకు గుర్తింపు ఇవ్వాలి

ఆనందపురం : గ్రామాల్లో తక్షణ వైద్య సేవలను అందిస్తున్న గ్రామీణ వైద్యుల సేవలను ప్రభుత్వాలు వినియోగించుకొని వారికి తగిన గుర్తింపునివ్వాలని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ప్రతినిధి డాక్టర్ ఎస్.ఎల్.రావు కోరారు. మండలంలోని వెల్లంకిలో ఆదివారం గ్రామీణ వైద్యుల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్.ఎల్.రావు మాట్లాడుతూ నిపుణులైన వైద్యుల వద్ద నైపుణ్యాలను సంపాదించుకొని అత్యవసర సేవలను అందిస్తున్న గ్రామీణ వైద్యులను గుర్తించవలసిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో గ్రామీణ వైద్యుల సంఘం ఉత్తరాంధ్ర కో-ఆర్డినేటర్ జంగం జోషి, కార్యదర్శి ఎస్.సుగణేశ్వరి, మండల శాఖ అధ్యక్షుడు పోతిరెడ్డి సుధాకర్ రెడ్డి, ప్రతినిధులు పచ్చిపులుసు కనకారావు, పడాల వినోద్ కుమార్, కె.నరసింహరావు, గొట్టిముక్కల రఘుబాబు, పడాల కోటేశ్వర రావు పాల్గొన్నారు.

భారతదేశ పరిపక్వతకు భగవద్గీతే మార్గం

తగరపువలస: భారతదేశ పరిపక్వతకు భగవద్గీతే మార్గమని పంపాన అరుణ్ శ్రీనివాసు అన్నారు. గీతా జయంతి ఉత్సవాలలో భాగంగా స్థానిక గీతా ప్రచార సంఘం ఆధ్వర్యంలో ఆదివారం సాంఖ్యయోగంలో కనువిప్పు అనే అంశంపై ప్రవచించారు. మహా పతివ్రత అయిన ద్రౌపదిని కురు రాజ్యంలో అవమానానికి గురి చేసిన, చూసిన, ఆమోదించిన వారెవరూ బతికి బట్టకూడదని ఆనాడే శ్రీకృష్ణ భగవానుడు భావించాడన్నారు. శ్రీకృష్ణుని సంకల్పమే భారతయుద్ధానికి కారణమన్నారు. పిడుగులను సైతం ఆపే శక్తి గల మగధీరుడైన అర్జునుడు యుద్ధానికి వెన్ను చూపే సమయంలో జ్ఞానబోధ చేశాడన్నారు. ఈ సృష్టిలో గీతాబోధను ప్రత్యక్షంగా చూసిన నలుగురులో అర్జునుడు, ఆంజనేయుడు, సంజయుని సాయంతో ధృతరాష్ట్రుడు, భీముని కుమారుడు బర్బీకుడు మాత్రమే అన్నారు. అర్జునుడు ముందు నుంచి యుద్ధం చేస్తే ఆంజనేయుడు జెండాపై కపిరాజు రూపంలో రక్షణగా నిలిచాడన్నారు. అర్జునుడు యుద్ధం నుంచి విరమిస్తే మానవజాతి మనుగడకే ప్రమాదంలో పడేదన్నారు. ఆర్యులు, స్వర్గద్వారాలు తెరచుకుని చూసే దేవతలు అర్జునుడిని నిందించేవారన్నారు. అర్జునుడు మారాం వెనుక మహత్కార్యం దాగుందన్నారు. అర్జునునికి శ్రీకృష్ణుడు చేసిన బోధనే వివేకానందుడు ప్రపంచానికి చాటి చెప్పారని గుర్తు చేశారు. ఈ సందర్భంగా గీతాప్రచార సంఘం భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు.


సాంఖ్యయోగంలో కనువిప్పు గురించి ప్రవచిస్తున్న పంపాన అరుణ్ శ్రీనివాసు

క్రిస్మస్ వేడుకలకు చర్చిలు సిద్ధం


తగరపువలసలోని ఆంధ్రా బాప్టిస్ట్ చర్చ్


విద్యుద్దీప కాంతులతో బంగ్లామెట్ట సియోను ప్రార్థనా మందిరం

తగరపువలస: సోమవారం క్రిస్మస్ వేడుకలకు భీమిలి అర్బన్, రూరల్ పరిధిలో చర్చిలు విద్యుద్దీప కాంతులతో వెలిగిపోతున్నాయి. చర్చిలపై శిలువ, నక్షత్రాలు ప్రత్యేక ఆకర్షణగా కనిపిస్తున్నాయి. స్థానిక ఆంధ్రా బాప్టిస్ట్ చర్చ్, చిట్టివలస లండన్ మిషన్ చర్చ్, బంగ్లామెట్ట సియోను ప్రార్థనా మందిరం, కొండపేట జీవం గల దేవుని సంఘం, ఆదర్శ నగర్, శ్రీనగర్, తాటితూరు, మూలకుద్దు, అన్నవరం, దాకమర్రి, టి.నగరపాలెం, రేఖవానిపాలెం, చిల్లపేట, జీరుపేట, రాయపాలెం, మజ్జిపేట తదితర గ్రామాల్లోని చర్చిల్లో వేడుకలు జరుగనున్నాయి.

అగ్నిగుండం తొక్కిన భవానీలు

తగరపువలస: జీవీఎంసీ భీమిలి జోన్ ఒకటోవార్డు సంతపేట కొత్తమ్మతల్లి ఆలయం వద్ద ఆదివారం రాత్రి భవానీలు అగ్నిగుండం తొక్కారు. అంతకు ముందు వారు కలశాలు, దివిటీలతో వీధులలో అమ్మవారి ఊరేగింపు ఘనంగా నిర్వహించారు. భీమిలి మండలం తాళ్లవలస, లక్ష్మీపురం పంచాయతీలలో ఆదివారం సాయంత్రం ఘనంగా అంబలం పూజా కార్యక్రమాలు జరిగాయి. తాళ్లవలస లెజెండ్ లే అవుట్‌లో మూడు మండపాలు, అభిషేకాలతో జరిగిన మహాసన్నిధాన పూజా కార్యక్రమంలో పాల్గొన్న స్వాములు, భవానీల శరణుఘోషతో పేటతుల్లి ఆడారు. వారికి నిర్వాహకులు కైంకర్యాలు ఏర్పాటు చేశారు.

తీరం... జనసంద్రం

కొమ్మాది: పిక్నిక్‌ల సీజన్ కావడంతో ఆదివారం, క్రిస్మస్ సెలవులు తోడవడంతో పర్యాటక ప్రాంతాలు జనసందోహంతో కిక్కిరిసిపోయాయి. సాగర్‌నగర్ బీచ్, రుషికొండ బీచ్, రామానాయుడు ఫిల్మ్ స్టూడియో, మంగమారిపేటబీచ్, రామాద్రి బీచ్, ఎర్రమట్టి దిబ్బలు, భీమిలి బీచ్ ప్రాంతాలు ఉదయం నుంచి సాయంత్ర వరకు వేలాది మంది పర్యాటకులతో తీర్థంలా కొనసాగాయి.


రుషికొండ బీచ్ వద్ద జన సమూహం

40 మంది రక్తదానం

ఆనందపురం : మండలంలోని గంభీరంలో ఆదివారం నిర్వహించిన రక్తదాన శిబిరంలో 40 మంది యువకులు రక్తదానం చేశారు. ఓఎస్‌జీ ఫౌండేషన్, వెంపాడ వెల్ఫేర్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. విద్యాశ్రీ బ్లడ్ బ్యాంక్ ప్రతినిధులు రక్తాన్ని సేకరించారు. ఈ సందర్భంగా ఓఎస్‌జీ ఫౌండేషన్ అధ్యక్షుడు శివ దలాయి మాట్లాడుతూ ఇంత వరకూ ఫౌండేషన్ ద్వారా 1,852 యూనిట్లు రక్తాన్ని సేకరించామని చెప్పారు. రోడ్డు ప్రమాద బాధితులు, క్యాన్సర్ పేషెంట్లు, తలసేమియా బాధితులకు రక్తాన్ని అందజేస్తున్నామని వివరించారు. ఈ కార్యక్రమంలో వెంపాడ వెల్ఫేర్ సొసైటీ వ్యవస్థాపకుడు వెంపాడ శ్రీనివాసరెడ్డి, ఫౌండేషన్ వైస్ ప్రెసిడెంట్ ఉమా మహేశ్వరి, కార్యదర్శి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.


రక్తదానం చేస్తున్న యువకులు